# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక






సంపుటి : 01 | సంచిక : 92 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 01 మార్చి 2026 | పేజీలు : 4




# భూ భారతి పేరుతో కుంభకోణం..!

- పేరు మార్చి ప్రజలను మోసం చేస్తున్నరు
- స్లాట్ బుకింగ్‌లో భారీ అవకతవకలు
- సిట్ వేసి విచారణ జరపాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

2


కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపిందని, దీనిపై వెంటనే సిట్ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని శనివారం నిర్వ హించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ మహారాజ్
# జయంతి

- పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు భక్తి, ఆధ్యాత్మిక శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ వ్యవహరించగా సభకు అజ్మీరా స్వామి నాయక్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్డీవో గోపీరామ్ పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

4








# భూభారతి పేరుతో కుంభకోణం..!

- పేరు మార్చి ప్రజలను మోసం చేస్తున్నరు
- స్లాట్ బుకింగ్‌లో భారీ అవకతవకలు
- సిట్ వేసి విచారణ జరపాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పేరుతో భారీ కుంభకోణానికి తెర లేపిందని, దీనిపై వెంటనే సిట్ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని శనివారం నిర్వ హించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి వ్యవస్థ, రైతుల సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ధరణి పేరుతో అమలు చేసిన సాఫ్ట్‌వేర్‌ను కేవలం పేరు మార్చి భూ భారతిగా కొనసాగిస్తున్నారని విమర్శించారు. వ్యవస్థలో ఎలాంటి మౌలిక మార్పులు చేయకుండా ప్రజలను మోసం చేయడం సరైంది కాదని, రాష్ట్ర ప్రజలు నిజమైన మార్పును ఆశించారని, కానీ ప్రభుత్వం కేవలం పేరును మాత్రమే మార్చిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అహంకార ధోరణితో మాట్లాడటం తగదన్నారు.

**-ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం**

తెలంగాణ ఉద్యమం నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడు తన్నీరు హరీష్ రావు అని ఎమ్మెల్యే పల్లా పేర్కొన్నారు. రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలే విశ్రాంతి తీసుకుంటూ మిగతా సమయాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికే కేటాయి స్తున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో వచ్చిన ఏ సమస్యైనా ఆయన దృష్టికి వెళ్లకుండా లేదు. వరంగల్ జిల్లాకు వారం రోజుల్లో మూడుసార్లు రావడం ఆయన ప్రజలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

**- ప్రభుత్వాన్ని కదిలించాం..**

దేవాదుల ప్రాజెక్టు నీళ్లు వరంగల్‌కు అందడం లేదని ప్రజలు ఫిర్యాదు చేయగానే హరీష్ రావు వెంటనే స్పందించి ప్రెస్‌మీట్ నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీశారని చెప్పారు. ఆయన పోరాటం వల్లే ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

**ఉత్తర తెలంగాణ అభివృద్ధి లక్ష్యం**

హరీష్ రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హెల్త్ సిటీ ఏర్పాటు కోసం కృషి చేశారు. ఎన్నికల ముందు పూర్తి చేయాలని భావించిన పనులు కొన్ని అడ్డంకుల వల్ల ఆగిపోయినా ఇప్పటికీ వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇక కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యపై కూడా ప్రజల తరఫున పోరాటానికి సిద్ధమవుతున్నారని, ప్రజా సమస్యలపై పోరాటమే ఆయన ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు.

**భూ భారతిలో అవకతవకలు**

జనగామలో భూ భారతి వ్యవహారంలో పెద్ద ఎత్తున అవకతవకలు వెలుగుచూస్తున్నాయి.. స్లాట్ బుకింగ్ సమయంలో రైతులు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినప్పటికీ సిస్టమ్‌లో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే నమోదు చేసి, మిగిలిన మొత్తం అధికారులు, మీసేవ నిర్వాహకులు, బ్రోకర్లు కుమ్మక్కై దారి మళ్లించినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా వెయ్యి రూపాయలే నమోదు అయి నప్పటికీ మ్యూటేషన్, డాక్యుమెంటేషన్ పూర్తి చేయడం ప్రజల్లో అను మానాలకు తావిస్తోంది..కిందస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికా రుల వరకు ఈ వ్యవహారం జరిగిందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్త మవుతున్నాయని చెప్పారు.

**రైతులపైనే భారం వేయడం అన్యాయం**

ఈ వ్యవహారంపై వేలాది ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికే కొంతమంది మీసేవ నిర్వాహకులు, బ్రోకర్లను అరెస్ట్ చేసినప్పటికీ అసలు నష్టపోయింది రైతులేనన్నారు. ఇప్పుడు రైతులకు మిగిలిన డబ్బులు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం పూర్తిగా అన్యాయమని మండిపడ్డారు. సమావేశాలకు రాకపోతే డబ్బులు వసూలు చేస్తామని బెదిరింపులు చేస్తున్నారని రైతులు తమ వద్దకు వచ్చి వేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.



## 3న శ్రీసోమేశ్వర ఆలయ ద్వార బంధనం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి దేవాలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న ఉదయం 8 గంటలకు ఆలయం మూసివేయనున్నట్లు (ద్వార బంధనం) ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ, ప్రధాన అర్చకుడు దేవగిరి లక్ష్మన్న శనివారం పేర్కొన్నారు.తిరిగి 4వ తేదీ బుధవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారి దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు.




## ‘కార్మెల్’లో ఫేర్వెల్ డే వేడుకలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని కార్మెల్ విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులు ఫేర్వెల్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఒకరినొకరు మనోభావాలను పంచుకున్నారు. ప్రిన్సిపల్ లిజ్ బెత్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పదవ తరగతి ఎంతో కీలకమన్నారు. భవిష్యత్తుకు బాటలు ఏర్పాటు చేసుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఆమె ప్రసంగం విద్యార్థులను కట్టిపడేసింది. ఎంతో ఆసక్తిగా విన్నారు. ప్రిన్సిపల్ పదేపదే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వీడుకోలును ముగించారు.

## బాల్య వివాహాను నిర్మూలించాలి

**నర్మెట, మన చౌరాస్తా :** బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా సాధికారత ప్రతినిదులు పవిత్ర, హేమలత అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, స్కోప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా చేపట్టిన బాల్య వివాహ విముక్తా భారత్ ప్రచార రథం శనివారం మండలంలో పలు గ్రామాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్లే కలిగే శారీరక, మానసిక, సామాజిక ప్రభావాలపై ప్రజలకు వివరించారు. బాల్య వివాహం చట్ట విరుద్ధం అని, బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది అన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ ప్రశాంత్, స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.






## హన్మంతాపూర్‌లో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ

**నర్మెట, మన చౌరాస్తా:** హన్మంతాపూర్ ఉన్నత పాఠశాల లో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు కమల తమ్ముడు ప్రవీణ్ సామల ఎన్నారై రూ.50 వేల విలువగల 103 మంది విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కీర్తి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాం, కె. ఆగయ్య, జీ.శ్రీనివాస్, జీ.అనిత, స్వప్న, సంగీతమాదురి తదితరులు పాల్గొన్నారు.




## మేరు కులస్తులను బీసీ(ఏ)లో చేర్చాలి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** కుట్టు మిషన్ వృత్తి దారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మేరు కులస్తులను బీసీ(ఏ) లో చేర్చాలని మేరు సంఘం పాలకుర్తి మండల అధ్యక్షులు కీర్తి రాజ్ కమల్ డిమాండ్ చేశారు. కుట్టు మిషన్ సృష్టి కర్త ఎలియాస్ హోవే జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం టైలర్స్ డే వేడుకలను సంఘం భవనంలో ఏర్పాటు చేశారు. కీర్తి రాజ్ కమల్ మేరు కుల దైవం శ్రీ శ్రీ శ్రీ జఠగిరి శంకర దాసమయ్య, ఎలియాస్ హో చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో కుట్టు మిషన్ వృత్తి పై ఆధారపడిన మేరు కులస్తుల జీవనం రెక్కాడితే డొక్కాడని విదంగా అగమ్యగోచరంగా మారిందని, రెడిమేడ్ దుస్తుల పరిశ్రమలతో బతుకు కుదేలై చాలీ చాలని పనులతో కొట్టుమిట్టాడుతున్న మేరు కులస్తులకు ప్రభుత్వం కమీషన్ ను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ వెంకన్న, సోమ సత్యం, కీర్తి యాదగిరి, కీర్తి రవి, జిల్లా సహాయ కార్యదర్శి మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ వాసు, మండల సహాయ కార్యదర్శి లెనిన్ , వెంకటేశ్వర్లు, నిరంజన్ పాల్గొన్నారు.



# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**జనగామ, మన చౌరాస్తా :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్నె కాంప్లెక్స్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, కొన్నె ఉన్నత పాఠశాల, కొన్నె ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఉత్సాహభరితంగా సైన్స్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొన్నె కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలకిషన్ రావు మాట్లాడుతూ సీవీ రామన్ జీవితం విద్యార్థులకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకుని, సైన్స్ పట్ల ఆసక్తి, జిజ్ఞాసను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు వర్కింగ్ మోడల్స్, సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్, స్టాటిక్ మోడల్స్ మరియు డ్రాయింగ్ చార్ట్స్ ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రదర్శనలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమీర్, నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కేదార్, కొన్నె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణంరాజు, కటకం సుధీర్ రెడ్డి, నీల శ్రీనివాస్, గొట్టె కనకయ్య, నాగరాజు, కవిత, అపరంజి, మాజీద్, బొంగోని శ్రీనివాస్, అశోక్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## వంగర 'పీఎంశ్రీ' టీజీఆర్ఎస్ కాలేజీలో..

**వంగర, మన చౌరాస్తా :** పీఎం శ్రీ టీజీఆర్ఎస్ జూనియర్ కళాశాల వంగారలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ లక్ష్మా రెడ్డి, భిక్షపతి హాజరయ్యారు. ప్రొఫెసర్ లక్ష్మా రెడ్డి గారు గతంలో కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పనిచేసి, ప్రస్తుతం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. భిక్షపతి గారు జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పీఎం శ్రీ సైన్స్ వర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో విజ్ఞానాసక్తిని పెంపొందిస్తూ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.







## స్వామి వివేకానంద స్కూల్లో..

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని స్వామి వివేకానంద విద్యాలయంలో యూకేజీ నుంచి 5వ తరగతి వరకు 76 సైన్స్ ప్రాజెక్ట్ లతో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ దీపిక జోషి, కరస్పాండెంట్ సుదర్శన్ జోషి అధ్యక్షత వహించగా సైన్స్ టీచర్లు షాహిన్, లక్ష్మి,గుణశీల మరియు ఇతర టీచర్స్ శ్రీలత, షాజహా, లావణ్య, పేరెంట్స్ హరి ప్రసాద్, ధనలక్ష్మి, సురేష్, రమేష్, వాణి, సౌమ్య, యాసీన్, మాధవి, శ్వేత, అనురాధ, అనూష, అమూల్య, సందీప్, పరుశురాములు, రాజేష్, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.





# జగన్నాథపురంలో కౌలు భూమి వివాదం

## అన్నదమ్ముల వర్గాల మధ్య ఘర్షణ

**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో కౌలు భూమి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన అన్నదమ్ములు కస్తూరి రాజయ్య, కస్తూరి కొమురయ్య మధ్య సుమారు నాలుగు ఎకరాల కౌలు భూమి సాగు హక్కులపై గత కొన్ని రోజులుగా విభేదాలు కొనసాగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భూమిని ఎవరు సాగు చేయాలన్న అంశంపై పలుమార్లు మాటల తగాదాలు జరిగినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి వివాదం మరింత తీవ్రమైంది. ఒక వర్గానికి చెందిన వారు మరో వర్గం ఇంటి వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తమైంది. ఈ క్రమంలో రాజయ్య కుటుంబ సభ్యుల ఇంటిపై దాడి చేసి, కారంపొడి చల్లి కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నట్లు బాధితులు ఆరోపించారు. ఈ ఘటనలో రాజయ్య కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. కొందరికి తల, చేతులు, శరీర భాగాల్లో గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి వారిని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దాడి ఘటనపై రాజయ్య కుటుంబ సభ్యులు ఎల్కతుర్తి



పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, ఇరువర్గాల వివరాలు సేకరించారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా కేసు నమోదు చేసి, ఘర్షణకు గల కారణాలు, పాల్గొన్న వ్యక్తులపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా, దాడిలో గాయపడిన బాధితుల కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.




## జనగామ అమ్మ క్యాంటీన్ ఆధ్వర్యంలో

# అన్నప్రసాద వితరణ

**జనగామ, మన చౌరాస్తా :** బచ్చన్నపేట వాస్తవ్యులు ఈదులకంటి వెంకట్ రెడ్డి, ఈదులకంటి పునీత, శ్రీనాథ్ రెడ్డి, శ్రీనిత రెడ్డి మానవతా దృక్పథంతో జనగామ గవర్నమెంట్ ఆసుపత్రి వద్ద పేద ప్రజలకి అన్నప్రసాద వితరణ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలి తీర్చి మానవత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకట్ రెడ్డి స్నేహితులు ఎండి ఖదీర్, బోడ కుంటి శీను, జంగిడి సిద్ధులు, అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, బింగి నరసింహులు, ఎండి అఫ్రోజ్, బల్ల శంకర్, ఏదునూరి శ్రీను, చిన్న, కొయ్యడ కవిత విశ్వ బ్లేస్సి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సేవాలాల్ మహారాజ్

# జయంతి వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు భక్తి, ఆధ్యాత్మిక శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ వ్యవహరించగా సభకు అజ్మీరా స్వామి నాయక్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్డీవో గోపీరామ్ పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ పార్క్ నుండి జూబ్లీ ఫంక్షన్ హాల్ వరకు సంప్రదాయ నృత్యాలు, వస్త్రధారణతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో బోగ్ బండారం కార్యక్రమం జరిగింది. అనంతరం నూతన మున్సిపల్ చైర్మెన్ కడమంచి బాలమణి శ్రీనివాస్ దంపతులను సన్మానించారు. పట్టణంలో బంజారాల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో గాంధీ నాయక్, మూడ్ లక్ష్మణ్ నాయక్, మూడావత్ సంపత్ నాయక్, బిక్షపతి నాయక్, సుమన్ నాయక్, వాంకుడోతు అనిత, కొర్ర రాజేంద్ర నాయక్, భూక్య జూమ్లాల్ నాయక్, భూక్య జయరాం నాయక్, కోటి ,ధారావత్ రాజు నాయక్, బానోత్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# తప్పుడు ధ్రువ పత్రాలతో నా భూమి కాజేశారు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తప్పుడు ధ్రువపత్రాలతో తమ భూమిని కాజేశారని ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం భీమదేవరపల్లి తహసిల్దార్ కార్యాలయం ఎదుట తన గోడు వెల్లబోసుకుంది. భూ బాధితురాలు కుక్కమూడి రాజేశ్వరి కూతురు స్నేహలత తెలిపిన వివరాల మేరకు.. భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామ శివారులో 340/10 సర్వే నంబర్ లో మూడు ఎకరాల అసైన్డ్ భూమి ఉందని, దానిని 2019లో తప్పుడు ధృవపత్రాలతో అధికారులు ఇతరులకు రీ అసైన్ చేశారని బాధితురాలు ఆరోపించారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, తమ భూమిని వేరే వారి పేరుకు ఎలా మార్పిడి చేశారని వాపోయారు. పి ఓ టి చట్టం ప్రకారం సాదా బైనామాలో పంచనామా చేసి ఇతరులకు రీ అసైన్మెంట్ చేశారని, దీనికి సంబంధించిన వివరాలను ఆర్టిఐ ద్వారా తెలుసుకున్నట్లు బాధితురాలు వెల్లడించారు. డిజిటల్ పాస్ బుక్ వచ్చిన తర్వాత ఇతరులకు తమ భూమిని ఎలా పట్టా చేస్తారని ప్రశ్నించారు. ఇది పూర్తిగా అధికారుల తప్పిదమే అని మండిపడ్డారు. తమ భూమిని తమకే కేటాయించాలని బాధితురాలు స్నేహలత డిమాండ్ చేశారు. 2020 నుంచి కలెక్టరేట్, మండల రెవెన్యూ కార్యాలయాల చెట్టు తిరిగిన తమకు న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**